సాక్షి
నల్లగొండ
శుక్రవారం : 13 : జూన్ : 2025



హైలెవల్ కమిటీ ఏర్పాటు చేశాం

యాదగిరి క్షేత్రంలోని ఆలయ ప్రసాద గోదాంలో చింతపండు చోరీ ఘటనపై విచారణకు హైలెవల్ కమిటీ వేశారు. - 8లో



ఆదాయం రూ.4.47 కోట్లు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని లెక్కించగా రూ.4.47 కోట్ల ఆదాయం సమకూరింది. - 8లో



మోదీ పాలన అద్భుతం

కేంద్రంలో 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన అద్భుతంగా ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సాక్షిప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన లక్ష్మణ్‌ను ఇటీవల ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ మంత్రిగా నియమించిన విషయం విదితమే. ఇప్పటివరకు నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావును కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించింది. ఇప్పటి వరకు ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ఈ సారి ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు అప్పగించలేదు.

రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ

నల్లగొండ అగ్రికల్చర్: కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు వానాకాలం సీజన్ రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా పొందుతున్న రైతులు బ్యాంకు అకౌంట్‌ను మార్చుకోవాలనుకునేందుకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులకు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జీరాక్స్‌ను అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైనర్లతో వెట్టిచాకిరీ చేయించడం నేరం



మాట్లాడుతున్న జడ్జి పురుషోత్తమరావు

రామగిరి(నల్లగొండ): మైనర్లతో వెట్టిచాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తమరావు అన్నారు. గురువారం నల్లగొండలోని జిల్లా న్యాయ సేవా సదన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. బాల కార్మిక నిర్మూలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి కృష్ణవేణి, లేబర్ అధికారి అరుణకుమారి, సీడబ్ల్యూసీ చైర్మన్ కృష్ణ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ భీమార్జున్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారిగా తిరుపతిరావు



నల్లగొండ టౌన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారిగా డాక్టర్ తిరుపతిరావు నియామకమయ్యారు. శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టనున్నారు. కాగా.. ఆయన గతంలో కూడా మాస్ మీడియా అధికారిగా పనిచేశారు. గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధిత చట్టం, గర్భవిచ్ఛిత్తి చట్టం, బాల్యవివాహాల నిషేధిత చట్టం, పొగాకు, గుట్కా ఉత్పత్తుల నిషేధిత చట్టాలను అమలు చేయడంతో కీలక పాత్ర పోషించారు. ఈమేరకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మాస్ మీడియా అధికారిగా అవార్డు అందుకున్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ, రామగిరి : నల్లగొండలోని డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాతత్వ శాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, సామాన్య శాస్త్ర బోధనా పద్ధతులు, గణిత శాస్త్ర బోధనా పద్ధతులు, సాంఘిక శాస్త్ర బోధనా పద్ధతులు, తెలుగు భాష బోధన పద్ధతులు, ఆరోగ్య, వ్యాయామ విద్య, దృశ్య కళలు, కళా విద్య సబ్జెక్టులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బయోడేటాతో పాటు జీరాక్స్ సర్టిఫికెట్లను జతపరచి ఈనెల 19 లోపు డైట్ కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

ప్రభుత్వ బీఈడీ కళాశాలలో..

నల్లగొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ భిక్షపతి తెలిపారు. ఈనెల19 లోపు దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9948215991 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్షర లోగిలిలో ఆనంద పండుగ



నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో పాఠశాల గేటును మామిడి తోరణాలు, బెలూన్లతో అలంకరించి పాఠశాలను విద్యార్థులతో పునఃప్రారంభింపజేస్తున్న ఉపాధ్యాయులు

- పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పూలు, మామిడి తోరణాలతో అలంకరణ
- పుష్పగుచ్ఛాలు అందజేసి విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- మొదటిరోజు 15 శాతం మంది మాత్రమే హాజరు
- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌తోపాటు స్కూల్ యూనిఫాం పంపిణీ

నల్లగొండ: వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలను పూలు, మామిడి తోరణాలతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. చాలా రోజుల తర్వాత తోటి స్నేహితులు కలవడంతో విద్యార్థులు కబుర్లు చెప్పుకుంటూ.. ఉపాధ్యాయులు చెప్పే విశేషాలు వింటూ గడిపారు. మొదటి రోజు కావడంతో జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. జిల్లాలో 1,483 పాఠశాలు ఉండగా వాటి పరిధిలో 15 శాతం విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

పండుగ వాతావరణంలో..

విద్యాశాఖ పాఠశాలలు పునఃప్రారంభానికి ముందు నుంచే బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే డీఈఓ భిక్షపతి ఆదేశాల మేరకు విద్యార్థులు మొదటి రోజు పాఠశాలలకు వస్తున్నందున తరగతి గదులను శుభ్రపరచడం, మామిడి తోరణాలు, బెలూన్లతో అలంకరించి పండగ వాతావరణంలో ప్రారంభించారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు స్కూల్ యూనిఫాం అందజేశారు.

'ప్రైవేటు పాఠశాలల బస్సులు గ్రామంలోకి రావొద్దు'



రామలింగాలగూడెం స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తిప్పర్తి : పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం మాజీ సర్పంచ్ ముత్తినేని శ్రీదేవిశ్యాంసుందర్, గ్రామపెద్దలు కలిసి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1నుంచి 5వ తరగతి వరకు పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేయించాలని, గ్రామంలోకి ప్రైవేట్ స్కూల్ బస్సులు రావొద్దంటూ గ్రామ స్టేజీ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

పలు పాఠశాలల్లో వినూత్నంగా ఇలా..

- నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మావిడాకులు కట్టి అందంగా అలంకరించారు.
- ఖతాల్ గూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చాక్లెట్లు పంపిణీ చేసి స్వాగతం పలికారు.
- పెద్దవూరలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హౌజింగ్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎస్‌పీ రాజ్‌కుమార్ కేక్ కట్ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.
- నకిరేకల్ మండలంలోని పాలెం గ్రామంలో పాఠశాల గేట్ ఎదుట రిబ్బన్ కట్ చేసి పాఠశాలను పునఃప్రారంభించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



కతాల్‌గూడలోని ప్రాథమిక పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు



చండూరు: బోడంగిపర్తిలోని పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్



చేనేత కార్మికురాలికి నేతన్నకు బీమా చెక్కు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

పోచంపల్లి ఇక్కత్‌కు ఉజ్వల భవిష్యత్

- ప్రపంచం, దేశంలో ఏ మూలకెళ్లినా ఇక్కత్ వస్త్రాలు ధరిస్తున్నారు
- చేనేత డిజైన్ల అభివృద్ధి, ఉపాధి కల్పనకు సహకరిస్తా
- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- సతీమణితో కలిసి భూదాన్‌పోచంపల్లి సందర్శన



ఆసుయంత్రం పనితీరును అడిగి తెలుసుకొంటున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంది.. కాటన్, సెమికాటన్, సిల్క్‌తో అనేక వెరైటీలలో ఇక్కత్ వస్త్రాలు తయారు చేయడం గొప్ప విషయమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కొనియాడారు. గురువారం ఆయన తన సతీమణి సుధా డెబ్బార్మతో కలిసి భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. టూరిజం పార్కులోని చేనేత కాన్ఫరెన్స్ హాలులో చేనేత కార్మికులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో నిర్వహించిన సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. దేశంలో ఏ మూలకుపోయినా పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ధరిస్తున్నారని అభినందించారు. పోచంపల్లి ఇక్కత్, కంచి, ఒడిశా తదితర చేనేత వస్త్రాలలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో గుర్తింపు ఉందన్నారు. ఇంటిగ్రేటెడ్ కల్చర్ ఎక్స్చేంజ్‌లో చేనేత వస్త్రాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు.

దేనికైతే పేరుంటుందో వాటికే నకిలీల బెడద

దేనికైతే పేరుంటుందో దానికి నకిలీల బెడద ఉంటుందని, దాంతోనే పోచంపల్లి ఇక్కత్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గొప్పదనం అర్థమవుతుందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రింట్‌ఫొటోకు, పెయింటింగ్ ఫొటోకు తేడా ఉన్నట్లే మిల్లులో తయారైన వస్త్రానికి, మగ్గంపైన తయారైన వస్త్రానికి ఉన్న తేడా, నాణ్యతను ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎప్పుడైనా చేనేత వస్త్రాలను మిల్లులో తయారైన వస్త్రంతో పోల్చుకోవద్దని సూచించారు. ప్రస్తుతం మార్కెటింగ్, డుప్లికేషన్ పెద్ద సమస్యగా మారిందన్నారు. పోచంపల్లికి వచ్చి ప్రత్యక్షంగా వస్త్రాల తయారీని చూడడం ఎంతో ఆనందంగా ఉందని, మళ్లీ పోచంపల్లికి వస్తానని పేర్కొన్నారు.

జూనియర్ కాలేజీకి కంప్యూటర్ ల్యాబ్ మంజూరు..

చేనేత నాయకుడు తడక వెంకటేశం ఇచ్చిన వినతి మేరకు గవర్నర్ స్పందిస్తూ పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి కంప్యూటర్ ల్యాబ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. చేనేత కార్మికులు గర్దాస్ ఉపేందర్, కుంట్లగూడెంకు చెందిన భాగ్యలక్ష్మి, వనం యాదగిరికు నేతన్న బీమా, కూరపాటి నిర్మల, పొట్టబత్తిని సుగుణ, దోర్నాల ధనుంజయ్యకు త్రిఫ్ట్ ఫండ్ చెక్కులను అందజేశారు.

చేనేత గృహాల సందర్శన

గవర్నర్ పోచంపల్లికి రాగానే తొలుత చేనేత కార్మికులు పెండెం కృష్ణ, భారత మధు, భారత భాస్కర్ గృహాలను సందర్శించారు. వారు గవర్నర్ దంపతులకు బొట్టుపెట్టి ఇంట్లోకి స్వాగతం పలికారు. ఎన్నేళ్ల నుంచి ఈ వృత్తిని చేస్తున్నారని, ఎంత గిట్టుబాటు అవుతుందని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టూరిజం పార్కులోని మ్యూజియంను సందర్శించారు. అక్కడ కొకూన్స్, నూలు, నూలువడకడం, చిటికికట్టడం, ఆసుపోయడం, రంగులద్దకం, మగ్గాలపై వస్త్రాలను తయారు చేయడం ప్రక్రియలన్నింటినీ నిశితంగా పరిశీలించారు. అలాగే పోచంపల్లి ఇక్కత్, తేలియా చేనేత వస్త్రాలను పరిశీలించారు. ఇక్కత్‌డిజైన్లను చూసి చేనేతకళాకారుల నైపుణ్యాలను కొనియాడారు. గవర్నర్ స్వయంగా మగ్గం నేసి అబ్బురపర్చారు. అనంతరం పోచంపల్లి చేనేత ప్రాముఖ్య ఏవీని తిలకించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, ఇందుమతి, ఆర్‌డీడీ పద్మ, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, ఏడీ శ్రీనివాసరావు, ఏడీఎం కళింగరెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖాబాబురావు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసిల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, చేనేతనాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, భారత లవకుమార్, ఎన్నం శివకుమార్, అంకం పాండు పాల్గొన్నారు.

నా రాజీనామా ప్రచారం అబద్ధం

- అవకాశం ఉంటే అధ్యక్ష పదవి ఇవ్వాలని అడిగా
- పదవి లేకపోయినా కార్యకర్తగా ఉంటా
- కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి, చిత్రంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తనకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చిందని, అయితే తనకు ఆ పదవి తగదని సీనియర్లకు అవకాశం ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడిని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరినట్లు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు గతంలో ఉమ్మడి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉందని, అందుకే జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే చేయాలని భావించినట్లు పేర్కొన్నారు. అవకాశం ఉంటే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడిని, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలను కోరినట్లు చెప్పారు. అవకాశం లేకపోతే కార్యకర్తగా పనిచేస్తానని అన్నారు. కోమటిరెడ్డికి దూరం అవుతున్నానంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా పార్టీని అంటిపెట్టుకొని ఉంటానని, పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తానని చెప్పారు. గత పది సంవత్సరాలు పార్టీ అధికారంలో లేకపోయినా, ఎవరు ఉన్నా, లేకున్నా తాను కార్యకర్తల వెంట ఉన్నానన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గుమ్మల మోహన్‌రెడ్డిది న్యాయబద్ధమైన కోరిక అని అన్నారు. ఆయన జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుకోవడంలో తప్పులేదని, ఈ విషయంలో గతంలో కూడా హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి, జూలకంటి వెంకట్‌రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, పోలె జయకుమార్, జహంగీర్ పాల్గొన్నారు.

సాగర్ క్రస్ట్‌గేట్ల డ్రై ట్రయల్ రన్ పనులు ముమ్మరం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయం రేడియల్ క్రస్ట్‌గేట్ల డ్రై ట్రయల్ రన్ పనులు ముమ్మరం చేశారు. గత నెలలోనే క్రస్ట్ గేట్లకు సీల్స్ వేయడం బోల్ట్‌నట్స్ బిగింపు, వెల్డింగ్ పనులు పూర్తిచేశారు. రెండు రోజులుగా గేట్లకు సంబంధించి డ్రై ట్రయల్ రన్ పనులు కొనసాగిస్తున్నారు. వర్షాకాలానికి ముందే అన్ని గేట్ల పనితీరును పూర్తిగా పరిశీలించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ చర్యలు ప్రారంభించారు. గేట్లను ఎత్తి, దింపేందుకు వినియోగించే ఇనుపతాళ్లకు కార్డియమ్ కంపౌండ్ చేయడంతో పాటు గ్రీసింగ్, బేరింగ్‌ల చెకింగ్ పనులు చేస్తున్నారు. ఒక్కో గేటు పనితీరును పరీక్షిస్తున్నారు. ప్రస్తుతం 1, 2 గేట్ల పనులు పూర్తి చేశామని, ఈ మాసాంతం లోపే 26 రేడియల్ క్రస్ట్ గేట్ల పనులు ముమ్మరం చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు.



ఇనుప రోప్‌కు గ్రీజింగ్ చేస్తున్న సిబ్బంది

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.63,09,560

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం ఆలయ సిబ్బంది లెక్కించారు. 79 రోజులకుగాను రూ.63,09,560 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ వెల్లడించారు. అన్నదానానికిగాను రూ.49,512 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కేవీఎస్‌లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో టెన్త్, ఇంటర్‌లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. టెన్త్‌లో 12, ఇంటర్ ఫస్టియర్‌లో 8, సెకండియర్‌లో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులను క్రమం తప్పకుండా తీసుకురావాలి



గుర్రంపోడులోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుర్రంపోడు : తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గుర్రంపోడు మండల కేంద్రంలో భవిత విద్యావనరుల కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. ఒక్కో విద్యార్థి పేరు అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి కలెక్టర్ రెండు పెంపుడు కుక్కలను తెప్పించారు. పిల్లలు వాటితో ఆడుకుంటూ ఉత్సాహంగా ఉండటాన్ని గమనించారు. కుక్కకు పేరు ఏమి పెడతారని పిల్లలను ప్రశ్నించగా.. వారు మ్యాంగో అని పెడతామని పేర్కొన్నారు. కేంద్రానికి ఇంకా ఏమేం కావాలో ఐఈఆర్‌పీ శారదను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. కేజీబీవీలో వంట గదులు, వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ నోముల యాదగిరి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాగిణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ విజయశ్రీ, ఏఈ రవికుమార్ తదితరులున్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లో మందుల్లేవ్!

- అందుబాటులో ఉన్నవి రెండు, మూడు రకాల మందులు మాత్రమే
- నెల ప్రారంభం నుంచి కొరత
- ఇబ్బందులు పడుతున్న దీర్ఘకాలిక రోగులు
- ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు ఇండెంట్ పెట్టిన అధికారులు



ఫార్మసీలో తక్కువగా మందులు

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలోని వెల్‌నెస్ సెంటర్‌లో మందుల కొరత ఏర్పడింది. గత పదిహేను రోజులుగా కేవలం రెండు, మూడు రకాల మందులు మాత్రమే ఉండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతోపాటు మందులు ఇచ్చేందుకు గత ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసింది. ప్రతి రోజు సుమారు 200 నుంచి 500 మంది వరకు హెల్త్‌కార్డు కలిగిన వారు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. ముఖ్యంగా బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, కీళ్లు, మోకాళ్ల నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వెల్‌నెస్ సెంటర్‌లో నెలనెలా ఉచితంగా ట్యాబ్లెట్లు తీసుకువెళ్తుంటారు. గత పదిహేను రోజులుగా ట్యాబ్లెట్లు, ఇతర సిరప్‌లు లేని కారణంగా కేవలం ఒకటి, రెండు ట్యాబ్లెట్లు ఇచ్చి పంపుతున్నారు. ట్యాబ్లెట్లు వచ్చిన తరువాత అందిస్తామని, ఫోన్ చేసి రావాలని సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే అనేక ఇబ్బందులు పడుతున్నారు. మందుల గురించి అడిగితే ఆరోగ్య శ్రీ ట్రస్టుకు ఇండెంట్ పెట్టామని వెల్‌నెస్ సెంటర్ బాధ్యులు పేర్కొంటున్నారు.

గంటల తరబడి నిరీక్షణ..

ప్రస్తుతం వెల్‌నెస్ సెంటర్‌లోని ఫార్మసీలో ఒక్క ఫార్మసిస్టు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వైద్యులకు చూపించుకున్న వారు మందులు తీసుకోవాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా కొన్ని కుర్చీలు మాత్రమే ఉండడం, ఫ్యాన్లు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అదనంగా ఫార్మసిస్టులను నియమించి ఇబ్బందులు తొలగించాలని వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే రోగులు కోరుతున్నారు.

ఇండెంట్ పంపించాం

మందుల సరఫరాలో కొంత జాప్యం జరిగింది. వెల్‌నెస్ సెంటర్‌లో అవసరమైన మందుల కోసం ఇండెంట్ పంపించాం. రెండు, మూడు రోజుల్లో సరఫరా చేస్తారు. సరఫరా కాగానే మిగతా మందులను రోగులకు అందిస్తాం.

– డాక్టర్ లావణ్య, వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జ్

క్లుప్తంగా

420 కిలోల నల్లబెల్లం పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం సంచులను చూపుతున్న పోలీసులు

డిండి: నాటుసారా తయారీకి వినియోగించే నల్లబెల్లాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా డిండి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం సీబీ తండాకు చెందిన సభావత్ సురేందర్ తన ప్యాసింజర్ ఆటోలో 14 బస్తాల్లో 420 కిలోల నల్లబెల్లం, 100 కిలోల పటికను తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు డిండి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు ఆటోను పట్టుకున్నారు. పట్టుబడిన నల్లబెల్లాన్ని, పటికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి



మోక్షిత్ (ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): రోడ్డు దాటుతున్న బాలుడిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్ గ్రామ పరిధిలోని దండు మైసమ్మ ఆలయం వద్ద గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం తేలువారిగూడేనికి చెందిన గట్టిగొర్ల మహేష్, శ్రావణి దంపతులు వారి కుమారుడు మోక్షిత్(4)తో కలిసి గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామ పరిధిలోని దండు మైసమ్మ ఆలయ సన్నిధిలో తమ బంధువుల శుభకార్యానికి వచ్చారు. ఆలయం వద్ద మోక్షిత్ రోడ్డు దాటుతుండగా.. సూర్యాపేట నుంచి నెమ్మికల్లుకు వస్తున్న ట్రాక్టర్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మోక్షిత్‌ను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం ఉదయం శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని అర్చకులు వైభవంగా జరిపించారు. వేకువజామునే ఆలయాన్ని తెరచిన అర్చకులు స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు భక్తులచే జరిపించారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



సుదర్శన నారసింహ హోమం జరిపిస్తున్న అర్చకులు

హైలెవల్ కమిటీ ఏర్పాటు చేశాం

- చింతపండు చోరీ ఘటనపై వారం రోజుల్లో విచారణ పూర్తిచేస్తాం
- యాదగిరిగుట్ట ఆలయ ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాద విభాగంలోని గోదాంలో ఇటీవల చింతపండు చోరీ జరిగిన ఘటనపై లోతుగా విచారణ జరిపించేందుకు హైలెవల్ కమిటీని వేసినట్లు ఈఓ వెంకట్రావ్ తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట పైన తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతపండు చోరీ జరిగిన తర్వా నియమించిన ఫైమెన్ కమిటీతో సమగ్ర వివరాలు తెలియరాలేదన్నారు. అంతేకాకుండా ఇలాంటి ఘటనలు గతంలో ఏమైనా జరిగాయా అనే అంశాలను లోతుగా పరిశీలించేందుకు దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో రీజినల్ జాయింట్ కమిషనర్, రంగారెడ్డి, నల్లగొండ, సికింద్రాబాద్‌కు చెందిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లతో హైలెవల్ కమిటీ వేశామని వెల్లడించారు. ఈ కమిటీ సభ్యులు సోమవారం నుంచి ఆలయానికి వచ్చి విచారణ జరిపి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎండోమెంట్ కమిషనర్‌గా తానే ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో విచారణ పూర్తిచేసేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

ప్రతిరోజు 4వేల మందికి ఉచితంగా పులిహోర ప్రసాదం..

స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 3వేల నుంచి 4వేల మందికి 250 నుంచి 300 కిలోల పులిహోర ప్రసాదం ఉచితంగా అందజేస్తామన్నారు. అంతేకాకుండా ప్రతి శనివారం లడ్డూ ప్రసాదాన్ని తిరుమల తిరుపతి మాదిరిగా ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా దీనిని ప్రారంభించి, వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

రింగ్ రోడ్డు చుట్టూ సర్కిళ్లకు పేర్లు..

సత్యనారాయణస్వామి వ్రత మండపంలో వ్రతాలు చేయించే భక్తులకు స్వామి వారి శేష వస్త్రం, కనుమ, స్వామి వారి ప్రతిమను ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు రూట్ అర్థంకావడం కోసం యాదగిరి కొండ చుట్టూ ఉన్న రింగ్ రోడ్డులో పలు సర్కిళ్లకు పేర్లు పెట్టినట్లు పేర్కొన్నారు. వైకుంఠద్వారం వద్ద సర్కిల్ రోడ్డుకు శ్రీఅభయాంజనేయ సర్కిల్ అని, ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న సర్కిల్‌కు గరుడ సర్కిల్, కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు వద్ద ఉన్న సర్కిల్‌కు రామానుజ సర్కిల్, మల్లాపురానికి వెళ్లే మార్గంలో ఉన్న సర్కిల్‌కు యాదర్షి సర్కిల్‌గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. ఆయా సర్కిళ్ల వద్ద మూడు, నాలుగు నెలల్లో విగ్రహాలను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసం పెద్ద లిఫ్ట (25 మంది ఒకేసారి వెళ్లడానికి) పెట్టడానికి నిర్ణయం తీసుకున్నామని, ప్రభుత్వం అనుమతి తీసుకొని పనులు చేపడతామన్నారు. శనివారం, ఆదివారం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో మజ్జిగ, తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. బ్యాటరీ వాహనాలను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొండ పైన హోంగార్డు సిబ్బంది తక్కువగా ఉన్నారని, భద్రతా సిబ్బందిని పెంచే దిశగా పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. ఈ సమావేశంలో అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, అధికారులు దయాకర్‌రెడ్డి, రామారావు ఉన్నారు.

వ్రత మండపాన్ని తనిఖీ చేసిన ఈఓ

యాదగిరి కొండకు దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపాన్ని ఈఓ వెంకట్రావ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్రతాల నిర్వహణ తీరును, భక్తులకు ఇస్తున్న సామాగ్రి, ప్రసాదాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, అర్చకులకు సూచించారు.

11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలన అద్భుతం



మోదీ సుపరిపాలన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

నల్లగొండ టూటౌన్ : కేంద్రంలో 11 ఏళ్ల నరేంద్ర మోదీ పాలన అద్భుతంగా ఉందని, 70 ఏళ్లలో చేయని దేశాభివృద్ధిని 11 ఏళ్లలోనే ప్రధాని మోదీ చేసి చూపించారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు 2జీ స్కాం, బొగ్గు స్కాం, బోఫోర్స్ స్కాం ఉండేవని తెలిపారు. గుజరాత్ మోడల్ అభివృద్ధి నమూనాతో మోదీ నాయకత్వంలోనే బీజేపీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిందన్నారు. స్వచ్ఛ భారత్ కింద కోట్ల మందికి మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు పేదలకు 4కోట్ల ఇళ్లు మంజూరు చేసిన ఘటన మోదీదే అన్నారు. గతంలో తెలంగాణలో 2500 కి.మీ. మేర జాతీయ రహదారులు ఉండగా.. 11 ఏళ్లలోనే మరో 2500 కి.మీ. నిర్మించినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, కొత్త లైన్లు, గ్రామాల్లో బీటీ రోడ్లు లాంటి అభివృద్ధి చేసినా కాంగ్రెస్ నేతలు చూడలేకపోతున్నారని అన్నారు. 12 నెలల రేవంత్‌రెడ్డి పాలన చూసిన ప్రజలు మరో 20ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు ఓటెయ్యరని అన్నారు. 10 శాతం కమీషన్ చెల్లిస్తేనే బిల్లులు వస్తున్నాయని, కాంట్రాక్టర్లు ధర్నా చేసే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని అన్నారు. నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దివాళా తీయించిందన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక 7సార్లు పొడిగించారని, ఫోన్ ట్యాపింగ్ తదితర వాటిపై వేసిన కమిషన్ల మీద ప్రజలకు నమ్మకం లేదన్నారు. అనంతరం మోదీ 11 ఏళ్ల సుపరిపాలన కరపత్రాలను బీజేపీ నేతలతో కలిసి ఈటల ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు సునీతారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు, పల్లెబోయిన శ్యాంసుందర్, షేక్ బాబా, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. గురువారం నల్లగొండ పట్టణంలోని పద్మానగర్ కాలనీలో చేనేత కార్మికుల మగ్గాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. చేనేత కార్మికుల హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. చేనేత సంఘాలకు ఎన్నికలు పెట్టే ధైర్యం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. అనంతరం పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సమస్యలపై పద్మశాలి సంఘం నాయకులు ఎంపీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పోతెపాక లింగస్వామి, మిర్యాల వెంకటేశ్వర్లు, గడ్డం మహేష్, కాశమ్మ, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పకీరు మోహన్‌రెడ్డి, పాలకూరి రవి పాల్గొన్నారు.



ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

పేదలకు వరంలా బీబీనగర్ ఎయిమ్స్

- ఏడాదిలోపు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి
- ఎయిమ్స్ బోర్డు మెంబర్, ఎంపీ డీకే అరుణ

బీబీనగర్ : బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్య కళాశాల తెలంగాణ ప్రాంతంలోని పేదలకు వరంలా మారిందని ఎయిమ్స్ బోర్డు మెంబర్, ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం ఆమె ఎయిమ్స్‌ను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రి ప్రాంగణంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల గురించి ఎయిమ్స్ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో బీబీనగర్ ఎయిమ్స్‌పై కేంద్ర ప్రభుత్వం సమీక్ష జరపనుందని, దీంతో ఎయిమ్స్‌ను సందర్శించి వివరాలు తెలుసుకోవడం కోసం వచ్చినట్లు తెలిపారు. అతి తక్కువ ధరలకే వైద్య సేవలు, స్కానింగ్, ఇతర ల్యాబ్ పరీక్షలు జరుతున్నాయని దీంతో పేద ప్రజలకు ఎయిమ్స్‌లో చికిత్స పొందడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. దూర ప్రాంతాల నుంచి సైతం ఎయిమ్స్‌కు వచ్చి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు, పేద ప్రజల కోసం ఉపయోగపడే విధంగా ప్రధాన మంత్రి మోదీ ఎయిమ్స్ వైద్య కళాశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మరో ఏడాది లోపు బీబీనగర్ ఎయిమ్స్‌లో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని, నిర్మాణాలు సైతం పూర్తవుతాయని ఆమె చెప్పారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి, భువనగిరి జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఉన్నారు.



ఎయిమ్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీకే అరుణ, చిత్రంలో బీజేపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

శాలిగౌరారం: రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి చెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం వద్దిపాముల గ్రామ శివారులో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. శాలిగౌరారం మండలం తక్కెళ్లపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ వజ్జె భిక్షం(56) బుధవారం పని నిమిత్తం బైక్‌పై శాలిగౌరారం మండల కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో వద్దిపాముల గ్రామ శివారులో రోడ్డు పక్కన బైక్ ఆపి మూత్రవిసర్జన చేసి తిరిగి బైక్ ఎక్కుతుండగా.. పెర్కకొండారం గ్రామానికి చెందిన గంట వీరయ్య అతివేగంగా వచ్చి భిక్షంను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భిక్షం, వీరయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలిస్తుండగా.. భిక్షం మృతిచెందాడు. వీరయ్య కోమాలో ఉన్నట్లు తెలిసింది. భిక్షంకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భిక్షం భౌతికకాయానికి డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

నార్కట్‌పల్లి: స్కూటీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందారు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన ఎస్‌కే అమీర్ (23) తన స్నేహితుడు షోయబ్‌తో కలిసి స్కూటీపై హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్నారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులోని త్రిపుర హోటల్ సమీపంలో.. నిజామాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టింది. అమీర్ రోడ్డుపై పడిపోగా.. అతడి తల పైనుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్కూటీపై వెనుక కూర్చున్న షోయబ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని అమీర్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బాబాయి మహ్మద్ రఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ..



వంశీ (ఫైల్)

రామన్నపేట: తాటిచెట్టు పైనుంచి పడి గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రామన్నపేట మండలం జనంపల్లికి చెందిన గీత కార్మికుడు నోముల నర్సింహ చిన్న కుమారుడు వంశీ(24) మంగళవారం సాయంత్రం గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

యాదగిరీశుడి సేవలో హిమాచల్‌ప్రదేశ్ సీఎస్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ప్రబోధ్ సక్సేనా గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఈఓ వెంకట్రావ్, కలెక్టర్ హనుమంతరావు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



హిమాచల్‌ప్రదేశ్ చీఫ్ సెక్రటరీ ప్రబోధ్ సక్సేనాకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

హుండీ ఆదాయం రూ.4.47 కోట్లు



నగదు లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్, అధికారులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను కొండ కింద గల సత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఆలయ ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూ.4,47,66,560, మిశ్రమ బంగారం 115 గ్రాములు, మిశ్రమ వెండి 6.50 కిలోలు వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. వీటితో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ ఆదాయం 44 రోజులదిగా ఈఓ పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం

చిట్యాల: కుటుంబ కలహాలతో రైలు కింద పడి వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన చిట్యాల పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం జంగారెడ్డిపల్లికి చెందిన స్వప్న(28)కు చిట్యాల మండలం ఉరుమడ్లకు చెందిన రూపని భరత్‌తో 2009లో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. మనస్పర్థల కారణంగా వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వచ్చిన స్వప్న సాయంత్రం చిట్యాల పట్టణంలో భువనగిరి రోడ్డు పక్కన రైలు పట్టాలపై గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి బలవన్మరణానికి పాల్పడింది. గూడ్స్ రైలు లోకోపైలెట్ గుర్తించి నల్లగొండ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా స్వప్నను అత్తంటి వారు వేధింపులకు గురిచేశారని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.

ఎలుకల మందు తాగి..

వలిగొండ : కుటుంబ కలహాలతో ఎలుకల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికురాలు కాడిగల్ల రాములమ్మ (55) కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి, అనంతరం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన

నల్లగొండ టౌన్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతిచెందాడని గురువారం నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట శిశువు బంధువులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలం కేశన్నపల్లి గ్రామానికి చెందిన రమావత్ ఝాన్సీ ఈ నెల 6న కాన్పు కోసం నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో చేరింది. గురువారం ఉదయం ఝాన్సీని సాధారణ కాన్పు జరిగింది. అయితే 8నెలల శిశువు ఉమ్మ నీరు ఎక్కువగా తాగడంతో గర్భంలోనే మృతిచెందాడు. ఝాన్సీకి సైతం రక్తస్రావం కావడంతో ఐసీయూలో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే శిశువు చనిపోయాడని ఝాన్సీ బంధువులు మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని ఫిర్యాదు చేయాలని ఆందోళన చేస్తున్న వారికి సూచించారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ అర్బన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందగా.. వైద్యుల నిర్లక్షమే కారణం అంటూ మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ఘటన గురువారం మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చీమలపాటి జానకమ్మ(58) గుండె సమస్యతో మూడు రోజుల క్రితం మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి ఆస్పత్రిలో చేరింది. గురువారం సాయంత్రం ఆపరేషన్ చేసేందుకు వైద్యులు సిద్ధమవుతున్న సమయంలో ఆమె గుండెపోటుతో మృతి చెందింది. అయితే మూడు రోజులు పాటు ఆస్పత్రిలోనే ఉంచి ఎటువంటి వైద్య పరీక్షలు చేయలేదని, వైద్యుల నిర్లక్ష్యమే జానకమ్మ మృతికి కారణమని ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద ఆమె బంధువులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు ఆస్పత్రి బందోబస్త్ ఏర్పాటు చేశారు.

కోర్టు నుంచి వ్యక్తి పరారీ

భువనగిరిటౌన్: చెక్ బౌన్స్ కేసులో కోర్టుకు హాజరైన వ్యక్తి పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. భువనగిరి పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడిపై భువనగిరి కోర్టులో చెక్కు బౌన్స్ కేసు విచారణ కొనసాగుతోంది. అతడు కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం అతడికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అతడి తరఫు అడ్వకేట్ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశాడు. జడ్జి ఆ పిటిషనన్‌ను డిస్మిస్ చేసి సదరు వ్యక్తిని కస్టడీలోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో అతడు కోర్టులో నుంచి బయటకు వచ్చి పరారయ్యాడు. అతడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి భువనగిరి పట్టణ పోలీసులను ఆదేశించారు.

గవర్నర్ పర్యటనలో అపశృతి

- గోడ పైనుంచి రాయి మీద పడి చేనేత కార్మికుడి తలకు గాయం

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలో గురువారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. గవర్నర్ పర్యటన నేపథ్యంలో జనరేటర్ వాహనం నుంచి వినోబాభావే మందిరం గోడపై నుంచి టూరిజం పార్కులోనికి కరెంట్ వైరును అమర్చారు. ఈ క్రమంలో వినోబాభావే మందిరం టాయ్‌లెట్ స్లాబ్ గోడ పైనుంచి వెళ్తున్న వైరు కిందపడకుండా దాని మీద రాయి పెట్టారు. ఇది తెలియని పోచంపల్లికి చెందిన చేనేత కార్మికుడు చింతకింది యాదగిరి వినోబాభావే మందిరం ప్రాంగణంలో కూర్చున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ జనరేటర్ వాహనాన్ని ముందుకు తీసుకెళ్లడంతో వైరుపై ఉంచిన రాయి యాదగిరి తలపై పడటంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే అక్కడే ఉన్న డాక్టర్లు అతడికి ప్రథమ చికిత్స చేశారు. గాయమైన ప్రదేశంలో కుట్లు వేశారు.



గాయపడిన చింతకింది యాదగిరి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వలిగొండ: వలిగొండ మండలం నాగారం సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తి కారులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు నాగారం గ్రామ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో చిట్యాలకు వెళ్లే రహదారి పక్కన కారు ఆగి ఉండటం గమనించారు. పోలీసులు కారును తనిఖీ చేయగా.. డ్రైవర్ సీట్లో ఉన్న వ్యక్తి అప్పటికే మృతిచెందాడు. కారులో లభించిన ఆధార్‌కార్డు, లైసెన్స్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శి మండలం శివరాజనగర్‌కు చెందిన బండారి కృష్ణ(40)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించి.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- నిందితుడి అరెస్ట్
- రూ.8లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన దేవరకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి రూ.17లక్షలు వసూలు చేసి పరారైన నిందితుడిని గురువారం దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను దేవరకొండ ఏఎస్పీ మౌనిక గురువారం విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన మాదిన్నె కృష్ణ అలియాస్ వేణుగోపాల్‌రెడ్డి 2021లో దేవరకొండకు వలస వచ్చి స్థానిక బీఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్నాడు. అతడు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు చుట్టుపక్కల వారిని నమ్మించాడు. అతడు పనిచేసే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికి కాలనీకి చెందిన ముడావత్ స్వాతి, ఆమె భర్త రమేష్, షేక్ సైదాబేగం, ఆమె కుమారుడు షేక్ తబ్రీజ్‌తో పరిచయం పెంచుకున్నాడు. వారిని తన మాయ మాటలతో నమ్మించి వారి వద్ద నుంచి సుమారు రూ.17లక్షలు వివిధ దఫాలుగా తీసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన వారు ఉద్యోగాల విషయం ఏమైందంటూ అడిగినప్పుడల్లా టైం పడుతుందని చెబుతూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల వారు కృష్ణను గట్టిగా నిలదీయగా ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. దీంతో బాధితులు మార్చి 1న దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం నిందితుడిని ఏపీలోని అనంతపురం జిల్లాలో అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.8లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఇదిలా ఉంటే కృష్ణ గతంలో తన భార్యతో కలిసి ఖమ్మం జిల్లా తనికెళ్ల గ్రామంలో టైలరింగ్ పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడని, టైలరింగ్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోక అక్కడ కొద్దిమందితో కలిసి చిట్టీలు నిర్వహించి అక్కడి నుంచి అనంతపురానికి పరారైనట్లు ఏఎస్పీ పేర్కొన్నారు. అనంతపురంలో అక్కడ కూడా కొందరిని మోసం చేసి దేవరకొండకు వచ్చాడని తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ నర్సింహులు, ఎస్‌ఐలు కోటేష్, నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది సతీష్, రాజారాం, అంజి, వెంకన్న, చాంద్‌పాషా, సింహాద్రి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక